క్లుప్తంగా

మల్లన్న సేవలో మంత్రులు



హోం మంత్రి అనితకు జ్ఞాపిక అందజేస్తున్న ఈఓ

శ్రీశైలం: శ్రీభ్రమరాంబా మల్లికార్జునస్వామి వార్లను సోమవారం రాత్రి రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, హోం మంత్రి అనిత, రెవెన్యూ మంత్రి సత్యప్రసాద్, రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి వేర్వేరు సమయాల్లో దర్శించుకున్నారు. వారి వెంట శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి ఉన్నారు. ప్రధాన ఆలయ రాజగోపురం వద్ద దేవస్థానం ఈఓ, అర్చకులు ఆలయ మర్యాదలతో వారికి ఆహ్వానం పలికారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ఆశీర్వచన మండపంలో అర్చకులు వేదాశీర్వాదాలు అందించగా, ఈఓ శ్రీనివాసరావు వారికి స్వామి అమ్మవార్ల శేషవస్త్రాలు, లడ్డూ ప్రసాదాలు, స్వామి వారి జ్ఞాపికను అందజేశారు.

సమస్యలు పరిష్కరిస్తాం

పాములపాడు: రైతుల నుంచి వచ్చే ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ సుభద్రమ్మ అన్నారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ముగ్గురు రైతుల నుంచి భూసమస్యలపై అర్జీలు వచ్చాయి. పాములపాడు పొలిమేరలో భూములు కొలతలు వేసి, ఆన్‌లైన్ చేయాలని అర్జీలు వచ్చాయన్నారు. మండల కేంద్రంలోని రైస్‌మిల్లు నుంచి దుమ్ము ఎక్కువగా వస్తోంది అంటూ స్థానికులు ఎంపీడీఓ చంద్రశేఖర్‌కు అర్జీ ఇచ్చారు.

భూ ఆధార్ ఉన్న రైతులకే పథకాలు

పాములపాడు: భూ ఆధార్ ఉన్న రైతులకు మాత్రమే కేంద్ర, రాష్ట్ర పథకాలు అమలు చేసే పథకాలు వర్తిస్తాయని మండల వ్యవసాయాధికారి ఫణీశ్వరరెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక మండల వ్యవసాయాధికారి కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ సొంత భూమి ఉన్న ప్రతి రైతు ఈ నెల 25వ తేదీలోపు రైతు సేవా కేంద్రాల్లో పేర్లు నమోదు చేయించుకోవాలని సూచించారు. పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు, ఆధార్ లింక్ ఉన్న మొబైల్ నంబర్‌తో రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించాలన్నారు. ఈ విషయంపై రైతులు అశ్రద్ధ చేయవద్దని సూచించారు.

జిల్లా వ్యవసాయాధికారి ఆకస్మిక తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి మురళీ కృష్ణ

బండి ఆత్మకూరు: మండలంలో యూరియా కొరత ఉన్న నేపథ్యంలో ఏ.కోడూరు గ్రామ పీఏసీని సోమవారం జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ తనిఖీలో భాగంగా యూరియా స్టాక్ రిజిస్టర్, బిల్ బుక్ లను పరిశీలించారు. రైతులకు వారు సాగుచేసిన పొలానికి అనుగుణంగా యూరియా ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఏఓ స్వాతితో పాటు రైతులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగించొద్దు

మహానంది: మహానందిలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని విద్యుత్‌శాఖ ఏడీ సుబ్రహ్మణ్యం ఆదేశించారు. మహానందిలో జరుగుతున్న విద్యుత్ పనులను సోమవారం ఆయన పరిశీలించి ఏఈఈ ప్రభాకర్‌రెడ్డితో చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గతేడాది కంటే మరింత మెరుగైన ఏర్పాట్లు చేయాలన్నారు.

వైన్ షాపుల్లో గౌడ్ కులస్తులకు అన్యాయం

ఆత్మకూరు: పట్టణంలో గౌడ్ కులస్తులకు కేటాయించిన వైన్ షాపు టెండర్‌ల ప్రక్రియలో తమకు అన్యాయం జరిగిందని గౌడ్ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు డబ్బి వెంకటస్వామిగౌడ్, తాలూకా అధ్యక్షులు నారాయణగౌడ్ అన్నారు. పట్టణంలో సోమవారం గౌడ్ కులస్తులు నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గౌడ్ కులస్తుల సంక్షేమం కోసం వైన్‌షాపుల టెండర్లలో పది శాతం రిజర్వేషన్ కల్పించడమేగాక భారీగా సబ్సిడీ కూడా ఇచ్చిందన్నారు. దీంతో పట్టణంలోని 60 కుటుంబాలు కలిసి వైన్ షాపులకు రూ.10 వేలు, రూ.20 వేలు చొప్పున వేసుకొని నగదు చెల్లించి రెండు టెండర్లు వేయడం జరిగిందన్నారు. అయితే పట్టణంలోని ఈడిగ కులస్తులకు కాకుండా ఇతర ప్రాంతాలకు చెందిన వారి ద్వారా అగ్రకులాలకు చెందిన కొందరు నాలుగు టెండర్లు వేయించి, తమను మోసగించారన్నారు. ఇలా గౌడ్‌లను వెన్నుపోటు పొడవడం ఇతర కులస్తులకు తగదన్నారు. గీత కార్మికుల సంక్షేమాన్ని ఆలోచించి ప్రభుత్వం ఈ టెండర్లను రద్దు చేయాలని, రీ టెండర్లకు అవకాశం కల్పించాలన్నారు. కార్యక్రమంలో శ్రీనివాసుగౌడ్, తిరుమలేష్‌గౌడ్, హరిగౌడ్, పరమేశ్వర్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

శనగ రైతుకు నిరాశే

- ప్రారంభమైన శనగ పంట నూర్పిళ్లు
- తగ్గిన పంట దిగుబడి
- పడిపోయిన ధరతో ఆందోళన



శనగ పంట నూర్పిళ్లు చేస్తున్న రైతులు

పగిడ్యాల: రబీ సీజన్‌లో సాగు చేసిన శనగ పంట నూర్పిళ్లు ప్రారంభమయ్యాయి. ఆరుగాలం కష్టపడినా ఆశించిన దిగుబడులు రావడం లేదని అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పగిడ్యాల మండలంలోని పాత, కొత్త ముచ్చుమర్రి, నెహ్రూనగర్, పగిడ్యాల, కొత్త పాలమర్రి, బీరవోలు, లక్ష్మాపురం తదితర గ్రామాల్లోని రైతులు రబీలో రెండో పంటగా జేజే 11 రకం శనగ పంటను సాగు చేశారు. సుమారు 800 హెక్టార్లలో రైతులు శనగ పంటను సాగు చేసినట్లు వ్యవసాయ అధికారుల రికార్డులు వెల్లడి చేస్తున్నాయి. పంట వేయక ముందు క్వింటా రూ.7500 ప్రకారం కొనుగోలు చేసి విత్తుకుంటే పంట చేతికి రాగానే క్వింటా ధర అమాంతం రూ. 5800లకు పడిపోవడంతో శనగ రైతులు ధరాఘాతంతో విలవిలలాడిపోతున్నారు. పంట దిగుబడి కోసం సస్యరక్షణ చర్యల కింద మందులు, పిచికారీ మందులు రూ. 30వేలకు పైగా వచ్చాయని.. ప్రస్తుత దిగుబడులు మాత్రం ఎకరానికి 4 క్వింటాళ్ల మేరకు వస్తున్నాయని ఆవేదన చెందుతున్నారు. గత ఏడాది 6 నుంచి 8 క్వింటాళ్ల మేరకు దిగుబడులు రాగా ఈ ఏడాది 4 క్వింటాళ్ల ప్రకారం వస్తున్నందున చేసిన అప్పులు ఎలా తీర్చాలోనని ఆవేదనకు గురవుతున్నారు. గత ప్రభుత్వం పెట్టుబడి సాయం కింద ఖరీఫ్, రబీ సీజన్ పంటలకు ముందే బ్యాంక్ ఖాతాల్లో నగదు జమ చేసేదని.. కూటమి ప్రభుత్వం రూ. 20వేలు ఇస్తామని ఇప్పటి వరకు ఒక్క పైసా కూడా జమ చేయలేదని వాపోతున్నారు. ప్రభుత్వం పెట్టుబడి సాయం జమ చేసి ఉంటే పెట్టుబడి ఖర్చులు మిగిలేవని పేర్కొంటున్నారు. కొనబోతే కొరివి.. అమ్మబోతే అడవి అన్న చందంగా రైతుల పరిస్థితి తయారైందని వాపోతున్నారు. దిగుబడులు రాక అల్లాడుతుంటే దీనికి తోడు ధర రూ. 5800లకు పడిపోవడం బాధేస్తోందని చెబుతున్నారు. ప్రభుత్వం స్పందించి క్వింటానికి కనీసం రూ. 8,500 మద్దతు ధరతో మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేస్తే అప్పుల ఊబిలో నుంచి బయటపడుతామని మండల రైతాంగం కోరుతున్నారు.

దిగుబడులు బాగా తగ్గాయి



రబీ సీజన్ రెండో పంటగా మూడున్నర ఎకరాల్లో జేజే 11 రకం శనగ పంటను సాగు చేశాను. పైరు బాగా పూత దశకు చేరుకోగానే పెంగల్ తుపాన్ ప్రభావంతో వారం రోజుల పాటు వర్షాలు పట్టుకున్నాయి. దీంతో మొదటి పూత రాలిపోయి పైరు పూర్తిగా దెబ్బతింది. ఎకరానికి 4 క్వింటాళ్ల మేరకు దిగుబడులు వస్తున్నాయి. కనీస మద్దతు ధర రూ. 8500లతో ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేస్తే అప్పుల నుంచి గట్టెక్కుతాం.

–గోపాల్, రైతు, పగిడ్యాల

పెట్టుబడి సాయం లేదు



రబీలో సుమారు 2.50 ఎకరాల్లో శనగ పంట వేశాం. గడెం బాడుగలు, విత్తనం ఖర్చులు, పెట్టుబడి ఖర్చులు ఎకరాకు రూ. 30 వేలకు పైగా వచ్చాయి. జగనన్న ప్రభుత్వంలో ఏటా పెట్టుబడి సాయం వచ్చేది. టీడీపీ ప్రభుత్వం వచ్చాక పెట్టుబడి సాయం ఇవ్వలేదు. అప్పులు చేసి పెట్టుబడులు పెట్టుకున్నాం. పంట దిగుబడుల చూస్తే కనీళ్లు వస్తున్నాయి. మార్కెట్ రేటు కూడా రూ. 6 వేలలోపే ఉంది. కనీసం రూ. 9 వేలు ధర ఉంటే గిట్టుబాటు అవుతుంది. ప్రభుత్వం స్పందించి గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలి.

–సుబ్బమ్మ, మహిళా రైతు, పగిడ్యాల

వార్డు సభ్యుల నిరసన



పడమర ప్రాతకోట సచివాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న వార్డు సభ్యులు

పగిడ్యాల: సాధారణ సమావేశం నిర్వహిస్తున్నాం.. సమావేశానికి రావాలని మూడో వార్డు సభ్యురాలు తెలుగు సావిత్రమ్మకు నోటీస్ ఇచ్చి మిగతా సభ్యులకు సమాచారం ఎందుకు తెలపలేదని వైఎస్సార్‌సీపీ మద్దతుతో గెలుపొందిన వార్డు సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం మండలంలోని పడమర ప్రాతకోట గ్రామ సచివాలయం ఎదుట నిరసన తెలిపారు. నోటీస్ కాపీని ప్రదర్శిస్తూ పంచాయతీ కార్యదర్శి తీరును తప్పుబట్టారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 నెలలు అవుతున్నా ఇప్పటి వరకు ఒక్క సమావేశం కూడా ఏర్పాటు చేయకపోవడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. సావిత్రమ్మకు ఇచ్చిన నోటీస్ కూడా పంచాయతీ కార్యదర్శి తయారు చేయలేదని.. టీడీపీ నేతలు రాయించినట్లు గుర్తించామని తెలిపారు. పంచాయతీ కార్యదర్శి, సర్పంచ్ కుమ్మక్కై ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. సావిత్రమ్మకు ఇచ్చిన నోటీస్‌లో స్పష్టంగా 10వ తేదీ సమావేశం ఉందని అజెండా అంశాలను పొందుపరిచి సమావేశాన్ని ఎందుకు జరుపలేదని నిలదీశారు. అయితే సాధారణ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎవరికీ నోటీస్ పంపలేదని సర్పంచ్ పిట్టల శేషమ్మ భర్త నాగేషు వార్డు సభ్యులతో పేర్కొనడం గమనార్హం. ఉప సర్పంచ్ లక్ష్మీదేవి, వార్డు సభ్యులు రత్నమ్మ, అమీర్‌బాషా, భారతి, శివరాముడు, ఎల్లమ్మ, నబీసా, శాంతమ్మ ఉన్నారు.

ఆల్బెండజోల్‌తో నులిపురుగుల నివారణ



నందికొట్కూరు జెడ్పీ బాలికల పాఠశాలలో మాత్రలు వేస్తున్న మున్సిపల్ కమిషనర్ బేబి



కొత్తపల్లి కేజీబీవీ పాఠశాలలో..



ఆత్మకూరులో మాత్రలు వేస్తున్న వైద్యాధికారి

నందికొట్కూరు: ఆల్బెండజోల్ మాత్రలతో నులిపురుగులను నివారించవచ్చని ప్రభుత్వ ఆస్పత్రి వైద్యుడు రాంబాబు, మున్సిపల్ కమిషనర్ బేబి అన్నారు. సోమవారం పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాల, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా 1 నుంచి 19 ఏళ్ల పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అపరిశుభ్రత వల్లే నులిపురుగులు పిల్లలకు సంక్రమిస్తాయన్నారు. చేతిగోర్లను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పిల్లలు శుభ్రంగా లేకపోవడంతోనే నులిపురుగులు వస్తాయని చెప్పారు. కలుషిత ఆహారం తీసుకోవడం, బహిరంగ ప్రదేశాల్లో మల విసర్జన చేయడం వల్ల నులిపురుగులు శరీరంలోకి ప్రవేశించి హాని చేస్తాయని తెలిపారు. ఆల్బెండజోల్ మాత్రలు వాడడం వల్ల కడుపులోని నులిపురుగులు తగ్గిపోతాయని పేర్కొన్నారు. నులిపురుగులను నిర్మూలించడంతో రక్తహీనత నియంత్రణలోకి వస్తుందన్నారు. వ్యాధి నిరోధక శక్తి మెరుగుపడుతుందని చెప్పారు. ఏకాగ్రత సామర్థ్యం పెరుగుతుందన్నారు. పనిచేసే శక్తి వస్తుందని తెలిపారు. పిల్లల గోర్లు ఎప్పటికప్పుడు కత్తిరించాలని, గోర్లల్లో మట్టి చేరకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రభుత్వాస్పత్రి వైద్యుడు విలాయ త్, హెడ్‌నర్సు భువనేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లి: కొత్తపల్లి, గోకవరం, ఎర్రమఠం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని గ్రామాల్లో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. నులిపురుగుల కారణంగా పిల్లల్లో రక్తహీనత సమస్య తలెత్తుతుందని వైద్యాధికారులు దీపానాగవేణి, మహమ్మద్ బేగ్, విజయేంద్ర, జబీర్ బాషా తెలిపారు.

ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

ఆత్మకూరు: మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో సోమవారం వైద్యాధికారులు గోపాల్, పవన్‌కుమార్, సీహెచ్ఓ ఖుద్దూస్‌బాషా విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను వేశారు. వారు మాట్లాడుతూ నులి పురుగులను పూర్తిగా నిర్మూలించడానికి ఆల్బెండజోల్ మాత్రలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు రవణమ్మ తదితరులు పాల్గొన్నారు.

వెలుగోడు: పట్టణంలోని రెండవ సచివాలయ పరిధిలోని ఎంపీపీ ఎస్ మెయిన్ స్కూల్‌లో మోత్కూర్ పీహెచ్‌సీ వైద్యాధికారిణి సుధా ప్రణీతి విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. విద్యార్థులకు భోజనానికి ముందు చేతులు శుభ్రం చేసుకోవాలని, కడుపులో ఉండే నులిపురుగులను నిర్మూలించాలంటే ఆల్బెండజోల్ మాత్రలు వాడాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ శ్రీదేవి, మధుసూదన్ రెడ్డి, సీహెచ్ఓ సౌందర్య, ఏఎన్ఎం స్వాతి పాల్గొన్నారు.

మహానంది: మండలంలోని ఎం.తిమ్మాపురం, గాజులపల్లె ఆరోగ్య కేంద్రాల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థినీ, విద్యార్థులకు సోమవారం ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. వైద్యాధికారులు భగవాన్‌దాస్, వెంకటరెడ్డి, వేణుకార్తికేయ ఆధ్వర్యంలో వ్యక్తిగత పరిశుభ్రతపై ముందుగా విద్యార్థులకు అవగాహన కల్పించారు.

బండి ఆత్మకూరు : మండల పరిధిలోని అన్ని విద్యా సంస్థల్లోని విద్యార్థులకు స్థానిక పీహెచ్‌సీ వైద్యులు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల ఆరోగ్యశాఖ అధికారులు ఆర్.సవిత, భావనా రెడ్డి, కిరణ్, ఎంఈఓ మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

మహానందీశ్వరుడికి పల్లకీసేవ



పల్లకీలో విహరిస్తున్న స్వామి, అమ్మవార్లు

మహానంది: మహానందిలో వెలిసిన శ్రీ గంగ, శ్రీ కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి దంపతులకు సోమవారం రాత్రి పల్లకీసేవ వైభవంగా జరిగింది. ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, నాగేశ్వరశర్మ, హనుమంతుశర్మ, శాంతారాంభట్, అర్చకులు శరభయ్యశర్మలు ముందుగా స్వామి, అమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించారు. అనంతరం పల్లకీలో కొలువు తీర్చి ఆలయ ప్రాకారంలో ఉత్సవాన్ని చేపట్టారు.

సమస్య ఏదైనా పరిష్కారం చూపిస్తాం

కొత్తపల్లి: గ్రామాల్లో సమస్య ఏదైనా వాటికి పరిష్కారం చూపిస్తామని తహసీల్దార్ ఉమారాణి అన్నారు. సోమవారం స్థానిక కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజలు, రైతుల సమస్యలు ఏవైనా సరే అర్జీల రూపంలో అధికారులకు తెలియజేస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. రైతుల నుంచి 3 వినతులు వచ్చాయన్నారు. వాటిని పరిష్కరించాలని వీఆర్వోలను ఆదేశించారు.

13న ప్రతిభ పరీక్ష

వెలుగోడు: ఈనెల 13వ తేదీన స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థినీ విద్యార్థులకు స్టూడెంట్స్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ప్రతిభ పరీక్ష నిర్వహిస్తున్నట్లు రిటైర్డ్ అధ్యాపకులు రవీంద్రుడు సోమవారం తెలిపారు. 13న ఉదయం 9. 30 నుంచి 12 గంటల వరకు పరీక్ష ఉంటుందన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు.

గుండెపోటుపై అప్రమత్తంగా ఉండాలి



ఇంజెక్షన్‌పై అవగాహన కల్పిస్తున్న ప్రభుత్వ వైద్యాధికారి సూపరింటెండెంట్ రాయుడు

ఆత్మకూరు: గుండెపోటుకు గురికాకుండా ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ వైద్యాధికారి సూపరింటెండెంట్ రాయుడు సూచించారు. సోమవారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో టెనెక్ట్ ప్లస్ ఇంజెక్షన్‌పై వైద్య సిబ్బందికి, ప్రజలకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ గుండెపోటును నివారించడానికి రూ.40 వేలు విలువ చేసే టెనెక్టెప్లేజ్ ఇంజెక్షన్‌ను ప్రభుత్వం ఉచితంగా అందిస్తుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్‌లు షౌకత్‌ఖాదర్, కవిత, జూనియర్ అసిస్టెంట్ కిరణ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అందుబాటులో అత్యవసర ఇంజెక్షన్

వెలుగోడు: వెలుగోడు సామాజిక ఆరోగ్య కేంద్రంలో రూ.40వేలు విలువ చేసే టెనెక్ట్ ప్లస్ ఇంజెక్షన్ అందుబాటులో ఉంటుందని ప్రభు త్వ వైద్యాధికారిణి సులోచన తెలిపారు. సోమ వా రం వైద్యశాలలో ఇంజెక్షన్‌పై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ ఛాతీనొప్పి, ఆయాసం, స్పృహ కోల్పోవడం, గుండెదడ వంటి లక్షణాలున్న రోగులకు ఈసీజీ పరీక్ష ద్వారా గుండెపోటును గుర్తించి, అత్యవసర ఇంజెక్షన్ టెనెక్టెప్లేజ్ ను ఇచ్చి ప్రాణాలను కాపాడుకోవచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు ఇక్రమ్ అలీ ఖాన్, వేణుగోపాలకృష్ణ, సోహెల్ తదితరులు పాల్గొన్నారు.

పోతులపాడు-చాబోలు రోడ్డుకు మోక్షం

సాక్షి ఎఫెక్ట్



జేసీబీ సహాయంతో గుంతలను చదును చేస్తున్న దృశ్యం

జూపాడుబంగ్లా: పోతులపాడు–చాబోలు రోడ్డుకు మోక్షం లభించింది. సోమవారం సాక్షి దినపత్రికలో ×ఈరోడ్లపై వెళితే దబిడి దిబిడే¤ శీర్షికన ప్రచురితమైన కథనానికి సర్పంచ్ పల్లె నిర్మలమ్మ, వ్యాం కంపెనీ ఇన్‌చార్జి రవీంద్రారెడ్డి స్పందించారు. 80బన్నూరు నుంచి చాబోలు వరకు గుంతలమయంగా ఉన్న రోడ్డు వెంట జేసీబీ సహాయంతో గుంతలను పూడ్చివేసి రోడ్డును బాగుచేయించారు. ఈ సందర్భంగా సర్పంచ్ పల్లె నిర్మలమ్మ మాట్లాడుతూ.. 80 బన్నూరు నుంచి హెడ్‌రెగ్యులేటర్ వరకు ఐదు కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణం రాయలసీమ ఎత్తిపోతల పథకం పనులు చేపట్టిన మెఘా కంపెనీ అధ్వర్యంలో ఉండేదన్నారు. పనులు నిలిచిపోవడంతో మెఘా కంపెనీ నిష్క్రమించినట్లు తెలిపారు. ఈ విషయాన్ని జలవనరుల శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో డీవియేషన్ పద్ధతిలో రోడ్డు నిర్మాణం కోసం పునఃఎస్టిమేషన్లను తయారు చేసి రోడ్డు నిర్మాణం అనుమతుల కోసం జలవనరులశాఖ ఉన్నతాధికారులకు పంపించినట్లు తెలిపారు. అనుమతులు మంజూరైన వెంటనే 80బన్నూరు నుంచి హెడ్‌రెగ్యులేటర్ వరకు బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

కష్టపడి చదివితే ఉత్తమ ఫలితాలు



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ నళిని, ఉపాధ్యాయులు

వెలుగోడు: విద్యార్థులు కష్టపడి చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ నళిని అన్నారు. ఎడ్యుకేషనల్ ఎపి ఫణి ఆధ్వర్యంలో జనవరి మాసంలో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన ఈఈఎంటీ – 2025 స్కాలర్ షిప్ పరీక్షలో పాఠశాలకు చెందిన పదవ తరగతి విద్యార్థి సుగురు శ్రీకాంత్, ఏడవ తరగతి విద్యార్థి బి రిషి కుమార్ జిల్లాస్థాయిలో ఫస్ట్ ర్యాంక్ సాధించినట్లు తెలిపారు. సోమవారం స్థానిక పాఠశాలలో విద్యార్థులకు అభినందన సభ ఏర్పాటు చేశారు. విద్యార్థులను, వారి విజయానికి కృషి చేసిన అధ్యాపక బందానికి అభినందనలు తెలిపారు.

శివరాత్రి ఏర్పాట్లను పరిశీలించిన కమిషనర్



ఏర్పాట్లను పరిశీలిస్తున్న దేవదాయశాఖ కమిషనర్, జిల్లా కలెక్టర్

శ్రీశైలం: శ్రీశైలం దేవస్థానంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ఈనెల 19 నుంచి ప్రారంభంకానున్న నేపథ్యంలో ఏర్పాట్లను దేవదాయ శాఖ కమిషనర్ రామచంద్రమోహన్, నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి సోమవారం పరిశీలించారు. ఉచిత, ప్రత్యేక, అతి శీఘ్రదర్శన, శివదీక్షా భక్తుల ప్రత్యేక క్యూలు పరిశీలించారు. ఉచిత ప్రత్యేక దర్శన క్యూలైన్లు ఎక్కడ నుంచి ప్రారంభం అవుతాయి, దర్శనానికి వారికి ఎంత సమయం పడుతుంది, క్యూ లైన్‌లో ఉన్నవారికి టాయిలెట్ సౌకర్యం ఉందా। తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. క్యూలైన్‌లో భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా ఏర్పాట్లు ఉండాలని సూచించారు. కార్యక్రమంలో డీఎస్పీ రామాంజనాయక్, ఈఓ. శ్రీనివాసరావు, సీఎఫ్ఓ చంద్రశేఖర్ ఆజాద్, సీఐ ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకి ఆలయ నిర్మాణానికి భూమిపూజ



తంగడంచలో ఆలయ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న వాల్మీకులు

జూపాడుబంగ్లా: వాల్మీకి మహర్షి ప్రతి ఒక్కరికీ ఆదర్శనీయుడని వాల్మీకి సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ జనరల్ సెక్రెటరీ జక్కుల శ్రీనినవాసరావు అన్నారు. సోమవారం మండలంలోని తంగడంచ గ్రామంలో వాల్మీకి మహర్షి ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దొంగగా జీవితం ప్రారంభించిన వాల్మీకి మహర్షి తన జీవితాన్ని మార్చుకొని రామయణాన్ని రచించే స్థాయికి ఎదగడం అమోఘమన్నారు. వాల్మీకి రచించిన రామాయణం మానవులకు ఆదర్శప్రాయంగా మారగా రామాయణ గ్రంథం సనాతనధర్మానికి ఆదర్శంగా నిలిచిందన్నారు. వాల్మీకి మహర్షి ఆలయ నిర్మాణానికి గ్రామానికి చెందిన అన్నివర్గాల ప్రజలు ముందుకురావడం ప్రశంసనీయమన్నారు. అనంతరం వేదమంత్రాల మధ్య వాల్మీకి మహర్షి ఆలయ నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. కార్యక్రమంలో పిక్కిలి శ్రీనివాసులు, శ్రీనివాసులు, మల్లికార్జున, వెంకటసుబ్బయ్య, మద్దిలేటి, గుజ్జల గౌరీశ్వరనాయుడు, గుజ్జల పూర్ణప్రకాశ్‌నాయుడు, చంద్రశేఖర్, ఉపేంద్రనాయుడు, పుల్లయ్య, రామకృష్ణ పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ట వేడుకలు



ఆంజనేయస్వామి విగ్రహాన్ని ప్రతిష్టిస్తున్న భక్తులు



ఆకట్టుకున్న చిన్నారుల కోలాటం

నందికొట్కూరు: పట్టణ శివారులోని పగిడ్యాల–కొణిదెల క్రాస్ రోడ్డు వద్ద ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట వేడుకలు సోమవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. బాజాభజంత్రీల మధ్య ఆంజనేయస్వామి విగ్రహం ప్రతిష్టించే ప్రాంతంలో పురోహితులు ప్రాణప్రతిష్ట పూజలు చేశారు. వేద మంత్రాలు, భక్తుల శ్రీఆంజనేయ నామస్మరణ నడుమ ఆంజనేయస్వామి విగ్రహాన్ని క్రేన్ సాయంతో ప్రతిష్టించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలిచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. చిన్నారుల కోలాటం ఆకట్టుకుంది. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. టౌన్ సీఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే జయసూర్య, టీడీపీ నంద్యాల జిల్లా నాయకుడు గౌరు వెంకటరెడ్డి పాల్గొన్నారు.

వీరాపురం డీలర్ అక్రమాలపై విచారణ

పగిడ్యాల: మండలంలోని నెహ్రూనగర్ గ్రామ పంచాయతీ మజార గ్రామమైన వీరాపురం డీలర్ సుకన్య నిత్యావసర సరుకులు సక్రమంగా వేయడం లేదన్న ఆరోపణలపై విచారణ చేపట్టినట్లు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీరంగారెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. తహసీల్దార్ శివరాముడు ఆదేశాల మేరకు 15వ షాపు పరిధిలోని తెల్లరేషన్ కార్డుదారులను విచారించగా సరుకులు సక్రమంగా వేయడం లేదని వెలుగు చూసిందన్నారు. మంగళవారం నుంచి గ్రామ వీఆర్వో హేమలత, వెంకటస్వామి ఆధ్వర్యంలో ఎండీయూ వెహికల్ ఆపరేటర్ శేఖర్ వినియోగదారులకు సరుకులు ఇంటింటికీ పంపిణీ చేస్తారని వెల్లడించారు. అలాగే పగిడ్యాలలో ఎండీయూ వెహికల్ ద్వారా సరుకులు ఇవ్వడం లేదని.. డీలర్ల వద్దే సరుకులు తెచ్చుకుంటామని పలువురు గ్రామస్తులు డిప్యూటీ తహసీల్దార్ మధు దృష్టికి తీసుకెళ్లగా విచారించి చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

రైతులకు ఆధార్ తరహాలో గుర్తింపు నంబర్



రైతులకు వివరాలు వెల్లడిస్తున్న ఏఓ కృష్ణారెడ్డి

నందికొట్కూరు: సొంత భూమి కలిగిన రైతులు రైతు సేవా కేంద్రంలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని వ్యవసాయ శాఖ ఏడీఏ విజయశేఖర్ తెలిపారు. సోమవారం పట్టణంలోని వ్యవసాయశాఖ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయ రంగాన్ని పూర్తిగా ఆధునీకరణ చేసేందుకు కేంద్ర ప్రభుత్వం రైతులకు 14 అంకెల ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్య కేటాయిస్తుందని తెలిపారు. సొంత భూమి కలిగిన రైతులు మాత్రమే వ్యవసాయ కార్యాలయంలో నమోదు చేసుకోవాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలు, రాయితీలు పొందాలంటే 14 అంకెల సంఖ్య తప్పనిసరి అని తెలిపారు. పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ, రాయితీలు, పెట్టుబడి, ఎరువుల రాయితీలు, పంటల బీమా, పంటల కనీస మద్దతు ధర, పంట రుణాలు కావాలంటే సొంత భూమి ఉన్న రైతులు రైతు సేవ కేంద్రానికి పట్టాదారు పాస్ పుస్తకం జిరాక్స్, 1–బీ, ఆధార్ జిరాక్స్, ఆధార్ నంబరుకు లింక్ అయిన ఫోన్ తీసుకొని రావాలని తెలిపారు.

ఫార్మర్ రిజిస్ట్రీతో ఎన్నో ప్రయోజనాలు

జూపాడుబంగ్లా: రైతులు ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవడం వల్ల బహుళ ప్రయోజనాలున్నాయని మండల వ్యవసాయ అధికారి కృష్ణారెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని తంగడంచ రైతు సేవా కేంద్రంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సొంత పొలం ఉన్న ప్రతి రైతు రైతు సేవా కేంద్రాల్లో పేర్లు నమోదు చేయించుకోవడం ద్వారా వారికి ప్రత్యేక గుర్తింపు సంఖ్య కేటాయిస్తారన్నారు. తద్వారా సొంత భూమి ఉన్న రైతులను గుర్తించడం సులభతరం అవుతుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందజేస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.